క్లుప్తంగా

చిన్నారి వైద్యానికి తాతాజీ భరోసా



తల్లి నుంచి చిన్నారి వివరాలు తెలుసుకుంటున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న చెవ్వేటి నరేంద్ర, సునీత దంపతుల నాలుగు నెలల కుమారుడు లివర్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. పెయింటింగ్ వర్క్ చేసే నరేంద్ర తన పిల్లాడికి వైద్యం చేయించడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దానితో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీని ఫోన్‌లో సంప్రదించాడు. మంగళవారం తాతాజీ నరేంద్ర ఇంటికి వెళ్లి పిల్లాడికి వైద్య సదుపాయం కల్పిస్తానని హామి ఇచ్చి ఆసుపత్రికి వెళ్లడానికి కొంత నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెన్ను విజయ్, గంటా నరేష్, పెచ్చెట్టి కృష్ణాజీ, పాలపర్తి కృపానాథ్, త్సవటపల్లి కృష్ణమోహన్, దిద్దే చిట్టిబాబు, షేక్ వల్లీ, తెన్నేటి శ్యామ్యూల్ పాల్గొన్నారు.

మేడపాడు మాజీ సర్పంచ్ రంగ ప్రసాద్ మృతి



రంగప్రసాద్ (ఫైల్)

యలమంచిలి: మేడపాడు మాజీ సర్పంచ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు అడ్డాల మోహన రంగప్రసాద్ (67) మంగళవారం మరణించారు. ఈయన 1988–95 మధ్య సర్పంచ్‌గా 1995–2002 కాలంలో సొసైటీ అధ్యక్షుడిగా పని చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పాలకొల్లులో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణానికి సంతాప సూచకంగా మేడపాడు గ్రామంలో వాణిజ్య దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మూసి వేశారు. ఆయన మృతిపై జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ



పెనుగొండలో దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి స్పందన

పెనుగొండ: ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన హెచ్చరించారు. మంగళవారం పెనుగొండ మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాపారాలు తప్పనిసరిగా రసీదుల ద్వారానే కొనుగోలు చేసి, రైతులకు విక్రయించేటప్పుడు కూడా ప్రతీ ఒక్కరికీ రసీదు ఇవ్వాలని సూచించారు. అనుమతిలేని నిల్వలు కలిగి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గోస్తనీ నది తీర్థోత్సవాల ప్రారంభం

పాలకోడేరు: మోగల్లులో గోస్తనీ నది 92వ తీర్థోత్సవాలను మంగళవారం వైభవంగా ప్రారంభించారు. తొలుత గ్రామంలోని ఆంజనేయ లక్ష్మణ సమేత సీతారామచంద్ర మహారాజు, పద్మావతి సహిత వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాలుగు బృందాలతో ఏకాహం నిర్వహించారు. సాయంత్రం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమాలను ఏఎస్ఆర్ సమితి, గోస్తనీ నది తీర్థోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నిర్ణీత సమయంలో ఆక్వా యూనివర్సిటీ పనుల పూర్తి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



లిఖితపూడిలో ఆక్వా యూనివర్సిటీ పనులను పరిశీలిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు, సబ్ కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నరసాపురం నియోజకవర్గంలో నిర్మించ తలపెట్టిన ఆక్వాయూనివర్సిటీ పరిపాలనా భవన సముదాయ నిర్మాణ పనులు నిర్ణీత సమయానికి పూర్తి చేస్తామని, ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు వెల్లడించారు. మంగళవారం నరసాపురం మండలం లిఖితపూడి గ్రామంలో నిర్మిస్తున్న ఆక్వా యూనివర్సిటీ పనులను సబ్ కలెక్టర్ సూర్య తేజ, ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఖిపూడి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఆక్వా యూనివర్సిటీ వరకూ ఆక్వా యూనివర్శిటీ వరకూ డబుల్ రోడ్డు నిర్మిస్తామని, అందుకు ఉన్న అడ్డంకులను తొలగించాలన్నారు. సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవన సముదాయం నిర్మితమవుతుందన్నారు. రూ.332 కోట్లతో పరిపాలనా ఆమోదానికి లభించగా ఇప్పటికే రూ.100 కోట్లు విడుదలయ్యాయన్నారు. యూనివర్సిటీకి అనుబంధంగా వేములదీవి తీర ప్రాంతంలో 400 ఎకరాల్లో ఆక్వా రీసెర్చ్ సెంటర్, నాలెడ్జ్ పార్కు వంటివి అక్కడ నిర్మిస్తామన్నారు. యూనివర్సిటీ నుంచి సరిపల్లి- నరసాపురం మీదుగా సింగిల్ రోడ్డు నిర్మిస్తామన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. కాంట్రాక్ట్ కంపెనీకూడా అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. తాను తరచూ పనుల పురోగతిని పరిశీలించేందుకు వస్తుంటానన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ నెల నుంచి ఆక్వా యూనివర్సిటీ తరగతులు ప్రారంభిస్తామన్నారు. దేశంలో మూడో ఆక్వా యూనివర్సిటీగా నిర్మిస్తున్న ఈ యూనివర్శిటీ నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆక్వా యూనివర్సిటీ భవన నిర్మాణ ఊహాచిత్రాన్ని అధికారులతో కలిసి ప్రసాదరాజు పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ ఫాజిల్, వెంకటేశ్వరరెడ్డి, నాయకులు చాగంటి సత్యనారాయణ, దొంగ మురళీకృష్ణ, ఉంగరాల రమేష్‌నాయుడు, చొప్పల సూర్యప్రకాష్, పోతురాజు గమిడి మధు, కృష్ణంరాజు, పోలిశెట్టి గోపీనాథ్, అడబాల అయ్యప్పనాయుడు, కస్తూరి శ్రీనివాస్, నూలి శ్రీనివాస్, ఆర్డై కృపారాజు, వీఆర్వోలు, లక్ష్మీనారాయణ, జయరాం తదితరులు ఉన్నారు.

విద్యపై కౌన్సెలింగ్

పాలకొల్లు సెంట్రల్: బాలలందరూ బడి బాట పట్టేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పట్టణ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాపాక ప్రభాకర్ తెలిపారు. మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం పట్టణంలో పలువురికి విద్యపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రభాకర్ మాట్లాడుతూ బాల్య దశలో విద్య యొక్క ఆవశ్యకతను వివరించారు. చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందని పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించి వారి భవిష్యత్‌కు పునాది వేయాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఎస్ఈబీ వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న ఎస్ఈబీ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఎస్ఈబీ అధికారులు వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు వేలం పాట నిర్వహించారు. మంగళవారం ఎస్ఈబీ కార్యాలయం అవరణలో మూడు వాహనాలకు వేలంపాట వేశారు. ఇందులో 13 మంది పాల్గొనగా ప్రభుత్వం ధర రూ. 28 వేలు నిర్ణయించినట్లు ఎస్ఈబీ సీఐ ఎల్ చిరంజీవి తెలిపారు. రూ.78,700 లు హెచ్చు పాటకు పాడుకున్న పాటదారునికి వాహనాలు అందజేసినట్లు తెలిపారు.

ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు ఫైర్





సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ
సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

నరసాపురం: పట్టణంలోని పలు వార్డుల్లో కాలనీల మధ్య, ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు కారణంగా పారిశుధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థలాలు కొనుగోలు చేసి వాటి యజమానులు వాటిని బాగు చేయకుండా వదిలేస్తున్నారని అన్నారు. పాములు సైతం పెరిగిపోయి చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి సమస్య పరిష్కరించాలని చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు. సంక్రాంతి సమయంలో 18వ వార్డులో నిర్వహించిన ప్రసిద్ధ వనువులమ్మ ఉత్సవాల వద్ద మున్సిపాలిటీ లైటింగ్, పారిశుద్ధ్యం విషయంలో ఈ ఏడాది మంచి చర్యలు చేపట్టారని వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని అభినందించారు. అలాగే పట్టణంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న మంచినీటి సరఫరా ప్రక్షాళనకు సంబంధించి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో రూ.62 కోట్లుతో మంజూరైన స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడంపై 1వవార్డు కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవానీ కృతజ్ఞతలు చెప్పారు. అలాగే తమ ప్రభుత్వం పట్టణంలోని విపక్ష వార్డుల్లోనే ఎక్కువ అభివృద్ధి పనులు మొదలు పెట్టిందని వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని పేర్కొన్నారు.

టౌన్ ప్లానింగ్ సెక్షన్ అవినీతిమయం

టౌన్‌ప్లానింగ్ సెక్షన్ మొత్తం అవినీతిమయమైందని 5వవార్డు సభ్యుడు వన్నెంరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. ఆదర్శనగర్‌లో విలువైన మున్సిపల్ స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్లాట్స్‌గా చేసి అమ్ముకాలు సాగిస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మున్సిపల్ డైలీ మార్కెట్ పన్ను వసూళ్లు ప్రభుత్వానికి చెడ్డపే రు వచ్చేలా చేస్తున్నారని కేసరి రాజు ఆరోపించారు.

రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్ల పాట పెట్టినప్పుడు ముందుగానే కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం మాత్రమే పన్నులు వసూలు చేసేలా చూడాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ దారుణంగా ఉందని విమర్శించారు. అధికారులు కౌన్సిలర్లు చెప్పిన పనులు కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ చిత్రపటంపై రగడ..

సమావేశం ప్రారంభంలోనే జనవరి 26న మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటం లేకుండా కార్యక్రమం నిర్వహించారని జిల్లెళ్ల దిలీప్ ప్రశ్నించారు. ఈ అంశంపై సమావేశంలో పెద్ద రగడ జరిగింది. కౌన్సిలర్లు వైకేఎస్, అడిదల శ్యామల, గొల్ల జయరాజ్‌సింగ్, కావలి రామసీత, సిర్రా కాంతమ్మ తదితరులు కమిషనర్ శ్రీనివాస్ చర్యను తప్పుపట్టారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫొటో లేకుండా కార్యక్రమం నిర్వహించడం తప్పని ఖండించారు. ఇప్పుడు సమావేశంలో అంబేడ్కర్ ఫొటో పెట్టి కమిషనర్ పూలదండలు వేయాలని వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ కూడా ఈ విషయంలో ఏకీభవించారు. దీంతో చివరకు కమిషనర్‌తో పాటుగా కౌన్సిలర్లు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించడంతో వివాదం సద్దుమణిగింది. సమావేశంలో ముందుగా ఇటీవల మృతిచెందిన మాజీమంత్రి వట్టి వసంతకుమార్, మాజీ కౌన్సిలర్ ద్వారా సత్యనారాయణల మృతికి సంతాపం పాటించారు. వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు బొంతు రాజశేఖర్, మల్లాడి శేషవేణి, పతివాడ పద్మ, పాలూరి బాబ్జి, తదితరులు పలు సమస్యలపై ప్రశ్నించారు.

ఘనంగా కృష్ణమ్మ గజమాల యాత్ర



గజమాల యాత్ర చేస్తున్న దృశ్యం

నరసాపురం: అంతర్వేది లక్ష్మీనర్సింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్రను మంగళవారం పట్టణంలోని డ్రై ఫిష్ మార్కెట్ వద్ద నుంచి అగ్నికుల క్షత్రియయూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరజిల్లుతున్న అంతర్వేది ఆలయ నిర్మాణానికి కొపనాతి కృష్ణమ్మ తన ఆస్తి అంతా విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు. ఆమె సేవలను గుర్తింపుగా యాత్ర చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పొన్నాల నాగబాబు, అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు, కొల్లు సుబ్రహ్మణ్యంపెమ్మాడి మోహన్‌లాల్, బర్రి మురళి, బర్రి రాజ్‌కుమార్, బి.కృష్ణభగవాన్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం పంచాయతీ అడవిపర్ర ప్రాంతంలో పేకాట స్థావరంపై మంగళవారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 9 మంది పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, 8 ద్విచక్ర వాహనాలు, రెండు సెల్ ఫోన్లు, రూ.4960 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.వీరబాబు తెలిపారు.

నాడు–నేడు అవకతవకలపై విచారణ



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

మొగల్తూరు: నాడు–నేడులో నిధులు దుర్వినియోగం జరిగినట్టుగా వచ్చిన ఆరోపణలపై విచారించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఎస్ఎస్ఏ డిప్యూటీ ఈఈ బీహెచ్ శక్తేశ్వరరావు తెలిపారు. మొగల్తూరు పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులపై అవతవకలు జరిగినట్లుగా పేరెంట్స్ కమిటీ సభ్యులు చేసిన ఫిర్యాదుపై మంగళవారం ఉన్నత పాఠశాలలో ముగ్గురు అధికారుల బృందం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమిటీ సభ్యులు చదలవాడ మణి, జల్లా గోపాల కృష్ణలు స్కూల్ కమిటీ చైర్మన్ బర్రి వెంకన్న నాడు–నేడు నిధులును తన ఖాతాలోకి మళ్లించుకోవడమే కాక చేపట్టిన పనులు కూడా నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ మూర్తి రాజు, స్కూల్ కమిటీ చైర్మన్‌ల నుంచి లిఖిత పూర్వకంగా తీసుకుని, ప్రతీ ఒక్కరినీ విచారించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయడానికి కనీసం వారం రోజులు సమయం పడుతుందన్నారు. ఈ విచారణలో డీఈఈ జి.నాగేంద్రబాబు, వీరవాసరం ఎంఈఓ బి.వినాయకుడు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి మహాయజ్ఞంపై ప్రచార యాత్ర



గాయత్రి మహాయజ్ఞంపై ప్రచారం చేస్తున్న మహిళలు, అప్పారావు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పరిసర గ్రామం ఉల్లంపర్రులో లారీస్టాండ్ పక్కన శ్రీ సూర్య రామచంద్ర రైస్ మిల్ (ఏఎస్ఆర్)లో ఫిబ్రవరి 5 ఆదివారం సకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగ ప్రేమ్ నిరంతర్ గురూజీ (నాన్న) ఆధ్వర్యంలో జరగనున్న మహా సంకల్ప విశ్వశాంతి గాయత్రీ మహాయజ్ఞం నిమిత్తం మహిళలు పట్టణ, గ్రామాల్లో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం సకారాత్మ ఫౌండేషన్ సభ్యులు ఇంటింటికి వెళ్లి గాయత్రి మహాయజ్ఞం కరపత్రాలను అందించి పూజకు ఆహ్వానిస్తున్నారు. ఈ పూజలో 108 అగ్నిహోత్రాలతో 864 మంది దంపతులు పాల్గొంటారన్నారు. ప్రచార యాత్రలో భాగంగా అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన ఆకుల అప్పారావు గత నెల రోజుల నుంచి తన మోటర్ వాహనంపై ప్రచారం ప్రారంభించారు. హిందూధర్మ పరిరక్షణ, హైందవ సాంప్రదాయాన్ని కాపాడాలనే సంకల్పంతో తాను ఇలా ప్రచారం ప్రారంభించానన్నారు. ధనుర్మాసంలో గోవింద స్వామి ప్రచారం చేశానని ప్రస్తుతం గాయత్రి మహాయజ్ఞం ప్రచారం చేస్తున్నానని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు రామాయణం, భారతం, భాగవతం, శ్లోకాలు, టీకా, తాత్పర్యం వంటివి నేర్పించాలన్నారు. తద్వారా భావితరాల వారికి మన హిందూ సాంప్రదాయం గురించి తెలుస్తుందన్నారు.

పందుల నిర్మూలనకు చర్యలు



పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషాద్రి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో పందుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ బుద్ద రామ సత్య శేషాద్రి తెలిపారు. మంగళవారం పట్టణంలోని పందుల పెంపకందారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ పందులను రోడ్లపై తిరగకుండా కట్టడి చేసుకోవాలని సూచించారు. పందులు మా వృత్తి, వ్యాపారం అంటే కుదరదని దానికన్నా ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని హెచ్చరించారు. దీంతో క్రమంగా పందులను నియంత్రించుకుంటామని పెంపకం దారులు తెలిపారు. వారం రోజుల్లో పందులను పట్టుకునే వాళ్లను నియమించి పట్టణంలో పందులను నిర్మూలిస్తామన్నారు. పట్టణంలో ప్రధానంగా పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రజలు కూడా సహకరించి చెత్తను రోడ్లపై వేయకుండా ఇంటింటికి వచ్చే చెత్త వాహనాల్లోనే వేయాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: దళితుల సమస్యలు పరిష్కరించడంలోనూ, ప్రభుత్వాల నుంచి రాయితీల కోసం పోరాటం చేయడంలో యూనియన్ పటిష్టంగా పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏపీ దళిత హక్కుల పోరాట సమితి 2023 డైరీని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మణరావు, దిద్దే నాగేశ్వరరావు, శెట్టిమి నాగేశ్వరరావు, దిద్దే ప్లీడర్, మల్లిపూడి జయరాజు, కన్నిపాముల దావీదు, కొండేటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

యలమంచిలి: కాజ తూర్పు గ్రామానికి చెందిన గోటేటి ప్రసాద్, కొంతేరు గ్రామానికి చెందిన బొట్టా వెంకటేశ్వరరావులు మంగళవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఆ రెండు గ్రామాలకు వెళ్లి ఇద్దరి మృతదేహాలపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు జవదాల సువర్ణరాజు, పాలంకి వెంకటేశ్వరరావు, కుక్కల రామకృష్ణ, నిమ్మకాయల రామకృష్ణ, లంక చిరంజీవి, పోలుకొండ ఏలియా భక్తసింగ్ తదితరులు ఉన్నారు.

ఆకివీడు చేరుకున్న ప్రత్యేక హోదా యాత్ర

ఆకివీడు: ప్రత్యేక హోదాతోనే పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 25న బయలుదేరిన యాత్ర మంగళవారం ఆకివీడు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలోనూ, ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీల్ని అమలుజేయడంలేదని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వై.రాము, మంతెన సీతారామ్, పెద్దిరాజు, ధనుష్ పాల్గొన్నారు.

రామాలయం వార్షికోత్సవాలు ప్రారంభం



పసుపు దంచుతున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధి సెంటర్‌లో నూతనంగా పునర్నిర్మాణం చేసిన రామాలయం మొదటి వార్షికోత్సవం ఘనంగా ప్రారంభించారు. మంగళవారం ఉదయం ఆలయంలో మహిళలు పసుపు దంచి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఉత్సవాలు మంగళవారం నుంచి శుక్రవారం వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి సీతారామచంద్రస్వామి కల్యాణం, బుధవారం రమా సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం రమా సత్యనారాయణస్వామి కల్యాణం, గురువారం పుష్పయాగం, శుక్రవారం అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీఖాకొల్లు వెంకన్న, విస్సకోట రంగనాయకులు, ఉప్పరి, బదరీ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో మంళవారం మధ్యాహ్నం 3 గంటలకు జగన్నాథపు వెంకటేశ్వరరావు ఉరదాలపాలెం వారితో భగవత్ పారాయణ, సాయంత్రం 5 గంటలకు రాగరవళి సంగీత నృత్య కళాక్షేత్రం తణుకు వారితో కూచిపూడి నృత్యం, సాయంత్రం 6 గంటలకు ఎస్.భారతి భాగవతారిణి ఏలూరు వారితో హరికథ, రాత్రి 8 గంటలకు సోని ఆర్కెస్ట్రా భీమవరం వారితో సినీ సంగీత విభావరి అలరించాయి.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్స ఉత్సవాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భగవత్ పారాయణ, సాయంత్రం 4 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనం , సాయంత్రం 5 సిని మ్యూజికల్ నైట్, 8 గంటలకు రెండు రత్నాలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.